క్లుప్తంగా

రేణుకారాజ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రశస్తిని అందుకున్న రేణుకారాజ్

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు రేణుకా రాజ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి ప్రశస్తిని అందుకున్నారు. డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని బెంగుళూరులో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం సిద్ధరామయ్య చేతులు మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. ఆ పాఠశాల హెచ్‌ఎం గోవిందప్పతో పాటు ఉపాధ్యాయులు రేణుకా రాజ్‌ను అభినందించారు.

ఎస్కేయూ పాలక మండలి సభ్యురాలికి సన్మానం



శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్రీలక్ష్మిని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకుల ఆధ్వర్యంలో శ్రీలక్ష్మిని మంగళవారం ఘనంగా సన్మానించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న బీఎం హరిప్రసాద్

హిందూపురం: జీవితంలో ప్రతి ఒక్కరూ పొదుపు, జీవితభద్రతతో పాటు భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పట్టణ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్, రామమూర్తి అన్నారు. ఎల్ఐసీ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం హిందూపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రైతులకు అందుబాటులో సేవలు



బాధ్యతలు చేపట్టిన డీడీ సత్యప్రకాష్

పెనుకొండ: రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని వెటర్నరీ శాఖ డీడీ సత్యప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని డీడీ కార్యాలయంలో నూతన డీడీగా సత్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యమన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కెంకెరలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలానికి కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ సచివాలయాలకు 209 మందికి పింఛన్లను ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిందన్నారు.

టమాట వాహనం బోల్తా



చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారిపై చిలమత్తూరు చేనేపల్లి క్రాస్ సమీపంలో టమాట లోడ్‌తో వెళ్తున్న బొలెరో మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. పావగడ నుండి బాగేపల్లి మార్కెట్‌కు టమాటలు తీసుకెళ్తుండగా చేనేపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం అదుపు తప్పిందని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. డ్రైవర్ గణేష్, క్లీనర్ ఉపేంద్రలకు స్వల్పగాయాలు కావడంతో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

పంటలు కళ కళ



రొద్దం: చిన్నగువ్వలపల్లిలో కళకళలాడుతున్న కంది

చిలమత్తూరు/అమరాపురం/రొద్దం/మడకశిరరూరల్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని దాదాపుగా అన్ని ప్రాంతాల్లో గత మూడు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వర్షం లేక మొన్నటి దాకా కళావిహీనంగా మారిన పంటలకు ఈ వర్షాలు జీవం పోయడంతో మళ్లీ పచ్చగా మారాయి. ఎండకాలంలో ఉన్న విధంగా ఎండతో పాటు ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలకు కూడా ఈ వర్షాలు ఊరటనిచ్చాయి.



చిలమత్తూరు: వర్షాలతో మరవకొత్తపల్లి వద్ద పచ్చగా మారిన మొక్కజొన్న చేను



అమరాపురం: వేరుశనగలో కలుపు తొలగిస్తున్న దృశ్యం



మడకశిరరూరల్: చిగిరి దగ్గర పచ్చగా కనిపిస్తున్న వేరుశనగ పంట

వర్షాలతో ఎంతో ఊరట



మరవకొత్తపల్లిలో ఎకరా పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాను. వర్షాభావంతో ఇబ్బందులు పడ్డాను. అయితే మూడు రోజులుగా వర్షాలు బాగా కురుస్తున్నాయి. వర్షాలు లేక పంటలు బాగా దెబ్బతినే పరిస్థితుల్లో ఈ వర్షాలు వల్ల పంటలు తేరుకున్నాయి. పంటలకు వచ్చే రోగాలు కూడా తగ్గిపోతాయి.

– లక్ష్మీనారాయణప్ప, కౌలు రైతు, చిలమత్తూరు

పంటకు ప్రాణం పోసింది



నేను జూలై నెలలో 30 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. అయితే వర్షం ఆలస్యం కావడంతో పంట దెబ్బతింటుందని ఎంతో ఆవేదన ఉండేవాడిని. అయితే ఈ సమయంలో వర్షం పడింది. దీంతో కంది పంటకు ప్రాణం పోసినట్టైంది.

– సుధాకర్‌రెడ్డి, రైతు, చిన్నగువ్వలపల్లి, రొద్దం

పంట పచ్చగా మారింది



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. అయితే చెట్లల్లో ఉడలు దిగే సమయంలో వర్షం పడకపోవడంతో పంట ఎండుముఖం పట్టుతోందని ఆందోళన చెందాను. ఈ సమయంలో మోస్తరు వర్షం పడింది. ఈ వర్షానికి వేరుశనగ మొక్కలు ప్రాణం పోసుకుని పచ్చగా కనిపిస్తున్నాయి.

– వెంకటరమణప్ప, రైతు, గుడ్డంపల్లి, మడకశిర మండలం

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

అమరాపురం: స్థానిక అతిథి గృహంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ ఈరన్న తెలిపారు.

వ్యక్తికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో పుట్టపర్తి – గోరంట్ల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లేపాక్షి మండల బింగిపల్లికి చెందిన శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు... శివారెడ్డి గోరంట్ల వైపు నుంచి పుట్టగుండ్లపల్లిలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. అయితే గుంతపల్లి బస్టాండ్‌లో ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శివారెడ్డిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బారికేడ్ల వితరణ

లేపాక్షి: నాగార్జున సిమెంట్ సౌజన్యంతో లేపాక్షి డీలర్ జయరామిరెడ్డి మంగళవారం ఉదయం రూ.10 వేలు విలువచేసే బారికేడ్లను గ్రామ సర్పంచ్ ఆదినారాయణకు అందజేశారు. జేఏసీ నాయకులు రాంప్రసాద్, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

400 సిమెంట్ బస్తాలు..

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లిలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి ధర్మ ప్రచార సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో కళ్యాణ మంటపాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కళ్యాణ మంటప నిర్మాణానికి రూ.1.60 లక్షల విలువ చేసే 400 సిమెంట్ బస్తాలను మంగళవారం ధర్మవరానికి చెందిన లక్ష్మీదేవి వెంకప్ప కుటుంబ సభ్యులు అందించారు. సిమెంట్‌కు అయ్యే మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

తప్పుల్లేని ఓటరు జాబితానే లక్ష్యం



హిందపురంలోని 129వ పోలింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ చేతన్

- జాయింట్ కలెక్టర్ చేతన్

హిందూపురం టౌన్: ఆరోగ్యకర ఓటరు జాబితా తయారు చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఓటరు జాబితా తయారీపై సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితా విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్థానిక హౌసింగ్ బోర్డులోని 129వ పోలింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సంయుక్తంగా పట్టణంలోని 44, 45, 46, 50వ పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి సౌకర్యాలపై ఆరా తీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని 44 వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పాలసముద్రానికి చెందిన కిశోర్ అనే వ్యక్తి మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతని నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య రాకూడదు

హిందూపురం: పట్టణంలోని ఏ వార్డులోనూ తాగునీటి సమస్య రాకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. నీటి సమస్య ఉన్న వార్డుల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీ కాకుండా పైప్‌లైన్‌లోకి మురికినీరు పోకుండా జాగ్రత్త వహించాలన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణయ్య వేషధారిణి

హిందూపురం టౌన్: స్థానిక పాంచజన్య, చైతన్య పాఠశాలల్లో మంగళవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణుడు, రాధా వేషధారలతో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పంట నమోదు తప్పనిసరి



మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును పరిశీలిస్తున్న ఏఓ విజయభారతి

పరిగి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. మండలంలోని పైడేటిలో జరుగుతున్న ఈపంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకురాలు సింధూ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను పెంపొందించుకోవాలి

మడకశిరరూరల్: మండలంలోని చందకచెర్లు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ సోనీబాయి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ఆదాయ వనరులను పెంపొందించుకొని గ్రామాభివృద్ధికి పాటుపడ్డాలన్నారు. సచివాలయంలో రికార్డులను పారదర్శకంగా ఉంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఆలసత్వం వీడి ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలని ఆదేశించారు. అర్జీలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కారం చూపాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

హిందూపురం అర్బన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తూమకుంట పంచాయతీ సర్పంచ్ రత్నమ్మ, కార్యదర్శి కెంచరాయప్ప పేర్కొన్నారు. మంగళవారం తూమకుంట పారిశ్రామివాడ, తూమకుంట చెక్‌పోస్టు, గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి



పోలీస్ అధికారులతో సమావేశమైన న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసులు చొరవ చూపాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఏడీఎం కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్‌కు సంబంధించి పరిష్కారమయ్యే కేసులపై డీఎస్పీ కంజాక్షన్, ఇతర పోలీస్ అధికారులతో చర్చించారు. ఎక్సైజ్, ఇతర సివిల్, ఐపీసీ కేసులు సాధ్యమైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. కోర్టుకు సంబంధించిన సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు సక్రమంగా పోలీసులు జారీ చేయలేకపోతున్నారని చెప్పారు. ఐఓ అధికారులు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. ఎప్పటికప్పుడు కేసులకు సంబంధించి నంబర్లు కేటాయిస్తున్నా విచారణకు వచ్చే సమయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. ఇకపై అలా జరగకుండా చూడాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాజీ కౌన్సిలర్ జయమ్మ, రమేష్‌రెడ్డిను కలసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి అన్నారు. మంగళవారం 2వ వార్డు చౌడేశ్వరీకాలనీ మాజీ కౌన్సిలర్ జయమ్మ, రమేష్‌రెడ్డిలను కలిశారు. అలాగే పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ రామచంద్రా, వేణుగోపాల్, రమేష్‌రెడ్డి ఆయనను కోరారు. అనంతరం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిలమత్తూరు, కోడూరు నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు.

బొలెరో బోల్తా



బైకలతో ఉన్న వాహనం బోల్తా పడిన దృశ్యం

హిందూపురం అర్బన్ : ద్విచక్ర వాహనాలు తీసుకెళ్తున్న టాటా ఏస్ బొలెరో వాహనం మంగళవారం పట్టణ సమీపంలోని ఏ వన్ కర్మాగారం సమీపంలో బోల్తా పడింది. అందులో ఉన్న 10కి పైగా ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోవడంతో బోల్తా పడినట్లు తెలిసింది. ప్రాణనష్టం జరగకపోవడంతో మళ్లీ ద్విచక్ర వాహనాలను అక్కడి నుంచి గోదాముకు తరలించారు.

ఆలయ ముఖద్వారాన్ని ఢీ కొన్న లారీ



విరిగి పడిన స్తంభాలు, స్వామి విగ్రహం

అమరాపురం: మండల కేంద్రంలోని చెరువు తూము వద్ద చెరువు ఆంజనేయ స్వామికి నూతనంగా ఏర్పాటు చేసిన ముఖద్వారాన్ని మంగళవారం లారీ ఢీ కొట్టింది. దీంతో స్తంభాలతో పాటు స్వామి విగ్రహం ముక్కలైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదన్నారు.

గురువులే మార్గదర్శకులు



హిందూపురం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్



లేపాక్షి: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



హిందూపురం: చిన్నమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాలలో..



మడకశిరరూరల్: నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో ..



పరిగి: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయుల వేషధారణలో పలువురు విద్యార్థులు ఆకట్టుకున్నారు.

- విద్యాబుద్ధులతో పాటు జీవిత మార్గదర్శకులు కూడా గురువులేనని ఏపీ ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతి సందర్భంగా హిందూపురం పట్టణంలోని ఆగ్రోస్ ఛైర్మన్ ఆఫీసు వద్ద పట్టణంలోని బాలాజీ, సప్తగిరితో పాటు పలు కళాశాలల్లోని అధ్యాపకులను సన్మానించారు.
- ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తిలేదని, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని డ్వామా పీడీ రామాంజినేయులు అన్నారు. మడకశిర మండలం బుళ్ల సముద్రం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.
- దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషిస్తున్నారని పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ అన్నారు. పావగడలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా పాఠశాలలు, హాస్టళ్లకు అదనపు భవనాలు నిర్మిస్తామని, ఉపాధ్యాయుల కొరత తీరుస్తానన్నారు.



అమరాపురం: సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థి



రొళ్ల: ఉపాధ్యాయులకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు



పెనుకొండ: కవి జాబిలి చాంద్‌బాషాను సన్మానిస్తున్న దృశ్యం



పెనుకొండరూరల్: ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు